

25న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి గీ పుట్టపర్తి క్రైమ్

ప్రజా సమస్యలపై ఈనెల 25న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్, పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని టిట్కోగృహాలు పూర్తిచేయాలని, జగనన్న లేఅవుట్లలో నిర్మించిన కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, మున్సిపాలిటీ లోని పారిశుధ్య కార్మికుల, ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి గ్రామంలో దళిత కాలనీ వాసులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, గిరిజన కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఈ వేసవిలో ఎక్కడ నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని తదితర వాటిని నెరవేర్చాలన్న డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. ధర్నాకుార్మిక, కర్షకులు, చిరు వ్యాపారులు, విద్యార్థి సంఘాల నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలకు నష్టం
పంటపొలాలను పరిశీలించిన రైతుసంఘం నాయకులు

అనంతపురం ఉమ్మడిలో శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు, అకాల వర్షానికి తీరని నష్టం జరిగింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వ్యాప్తంగా పలు మండలాల్లో పంటపొలాలు దెబ్బతిన్నాయి. దీంతో వందల ఎకరాల్లో అరటి, బొప్పాయి, మొక్కజొన్న తదితర పంటలు నేలకొరిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.
ప్రజాశక్తి పుట్లూరు, తాడిమర్రి



పుట్లూరు మండలంలో నేలకొరిగిన అరటిపంట

శింగనమల నియోజకవర్గ పరిధిలో శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు పంటపొలాలు దెబ్బతిన్నాయి. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మండలంలోని మడుగుపల్లి, మడ్డిపల్లి, జంగమరెడ్డి పేట, ఎల్లుట్ల, రంగరాజుకుంట, కుమ్మనమల తదితర గ్రామాల్లో ఈదురుగాలులకు పంటనేలకొరిగింది.పంట చేతికందే సమయంలో ప్రకతి వైపరీత్యాల కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోయారు. పుట్లూరు మండలంలో 25 ఎకరాల మొక్కజొన్న, 200 ఎకరాల్లో అరటి, 50 ఎకరాల్లో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లింది. నెల రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో ఈదురు గాలుల వలన పంటలన్నీ నేలమట్టమయ్యాయని జంగారెడ్డిపేట రైతు నారాయణప్ప వాపోయాడు. రెండున్నర ఎకరా పొలంలో అరటి పంట సాగు చేశానని చేతికొచ్చిన సమయానికి శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు పంట నేలకొరిగిందన్నారు. పంటసాగుకు రెండున్నర లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టానని చేతికొచ్చే సమయానికి నేల పాలయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

పంటనష్టాన్ని అంచనా వేయండి : శింగనమల నియోజకవర్గంలో ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించి పంటనష్టాన్ని అంచనా వేయాలని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. సంబంధించిన అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంటనష్టాన్ని అంచనావేయాలన్నారు.

శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలో దాదాపు 400 ఎకరాల్లో అరటిపంట ఈదురుగాలులకు దెబ్బతింది. 45 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతింది. ఈ నేపథ్యంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, నాయకులు ఆలకుంట మారుతి తాడిమర్రి మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. మండలంలోని దాడి తోట, నాయన పల్లి, తురక వారి పల్లి గ్రామాలలో దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈదురు గాలులకు, అకాల వర్షానికి మూడు గ్రామాలలోని 400 ఎకరాలలో అరటిపంట దెబ్బతినిందన్నారు. దాదాపుగా మూడు గ్రామాల పరిధిలోను రూ. 10 కోట్ల దాకా పంట నష్టం జరిగిఉంటుందన్నారు. అదేవిధంగా 40 ఎకరాల మొక్కజొన్న, ఇతర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ముదిగుబ్బ మండల పరిధిలోని ఇందుకూరు గ్రామానికి చెందిన రైతు గడ్డం లోక్నాథ్ రెడ్డి సాగు చేసిన అరటితోటలో 1500 చెట్లు విరిగిపడ్డాయి దీంతో రైతుకు ఐదు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఓబిరెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, రామిరెడ్డి, ఎన్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈదురు గాలులకు నష్టపోయిన పంటపొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనావేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు, అధికారులు ఆదివారం పంటపొలాలను పరిశీలించారు. అనంతపురం జిల్లాలో శనివారం వారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి 88ఎకరాల్లో మొక్క జొన్న పంట నష్టం జరిగినట్లు అంచనాలు అందినట్లు జిల్లా వ్యవసాయ అధికారియు. ఉమామహేశ్వరమ్మ ఆదివారం తెలిపారు. యల్లానూరు, పుట్లూరు మండలాల్లోని నాలుగు గ్రామాల్లోని 47మంది రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం వచ్చిందని వీటి నష్టం విలువ సుమారు రూ. 30.09లక్షలు ఉంటుందని అన్నారు వీటిని ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు.



తాడిమర్రి మండలంలో పడిపోయిన అరటిచెట్లను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

యల్లనూరు మండలంలో ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నం

వివరాలు మెయిన్‌పేజీలో...

మైనార్టీ సమస్యలంటే అలుసా !

ప్రభుత్వ సలహాదారు చెప్పినా నాన్చుడే
విస్మయం వ్యక్తం చేస్తున్న మైనార్టీలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉన్నతాధికారి ఒకరికి మైనార్టీల సమస్యలంటే అలుసుగా మారాయన్న విమర్శలు మైనార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. సాక్షాత్తు ప్రభుత్వ సలహాదారు చేసిన సిఫారసులనే పట్టించుకోకపోవడంతో మైనార్టీవర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో తమ అసంతృప్తినిబాహాటంగానే సోషియల్ మీడియా ద్వారా వెల్లడించడం పెద్ద చర్చనీయాంశమైంది. దాని తరువాతగాని అధికారిలో చలనం కలుగకపోవడం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశమైంది.

అసలు సమస్య ఏమిటి

జిల్లాలో అనేక సంవత్సరాలుగా మైనార్టీ సమస్యలు అపరిష్కృతంగా ఉంటూ వస్తున్నాయి. ఇందులో ప్రధానమైనది అనంతపురం నగరంలో వసతి గృహ నిర్మాణం. దశబ్దకాలం కిందటే ఇది మంజూరైంది. దీనికి స్థలం కేటాయింపుపై వివాదం నడుస్తూ నిర్మాణం ప్రారంభమవలేదు. అదే విధంగా గుంతకల్లులో మైనార్టీల కోసమని ప్రత్యేకంగా నిర్మించిన ఒక భవంతి. అందులో ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేసి కొన్నేళ్లుగా నడుస్తోంది. మైనార్టీ విద్యాభివృద్ధి కోసం నిర్మించిన ఈ భవనం అసలు లక్ష్యం నెరవేరే పరిస్థితి లేదు. ఇక ఎంఎస్‌డిపి (మల్టీ సెక్టోరియల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) కింద మైనార్టీల విద్యా, ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించబడి ఉన్నాయి. అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాలకు ఈ నిధులు కేటాయింపులు జరిపియున్నారు. కొన్నేళ్లు అవుతున్నా ఈ నిధుల వినియోగం జరగకుండా వృథాగానున్నాయి. ఈ నిధులను వినియోగంలోకి తీసుకురావాలని కొంత మంది జిల్లా మైనార్టీ నేతలు ప్రభుత్వ మైనార్టీ సలహాదారుగానున్న షరీఫ్‌కు ఇటీవల అనంతపురం వచ్చినప్పుడు విజ్ఞప్తి చేశారు. ఆయన తనను అధికారి కలవడానికి వస్తే అప్పుడే నేరుగా అధికారికి చెబుతానని చెప్పారు. అయితే సదరు అధికారి ప్రభుత్వ సలహాదారుని మర్యాదపూర్వకంగా కలవడానికి కూడా రాకపోవడంతో సంతకాలు చేసి సిఫారసు లేఖ ఇచ్చారు. అది స్థానిక నేతలు అధికారికి అందజేశారు. కొద్ది రోజుల తరువాత సలహాదారు షరీఫ్ తాను చేసిన సిఫారసులో ఏదైనా కదలిక వచ్చిందా అని స్థానిక నేతలను ఆరా తీశారు. లేదని చెప్పడంతో నేరుగా ఫోన్ చేసి అధికారికి సమస్యలను పరిశీలించమని



సూచించారు. అయినా ఫలితం లేకపోవడంతో మరోమారు సూచించారు. అయినా ఫలితం లేదు. దీంతో అసంతృప్తి చెందిన మైనార్టీ నేతలు ఈ విషయాన్ని సోషియల్ మీడియాలో పోస్టు చేశారు. మైనార్టీ సమస్యలంటే అధికారికి అంతటి అలుసా అంటూ విమర్శించారు. దీంతో ప్రభుత్వం దీనిపై ఆరా తీసింది. అంతటితోనే హడావుడి పడిన అధికారి సలహాదారు షరీఫ్‌కు నేరుగా ఫోన్ చేసి సమస్యలు చెబితే ఇప్పుడు పరిష్కరిస్తానని చెప్పినట్టు సమాచారం. స్థానిక నాయకులు వెళ్లి మరోమారు ఆయనకు సమస్యలను విన్నవించారు. అప్పుడుగాని ఆయనలో కదలిక రాలేదు. అయితే ఈ సమస్యలు ఇప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో కొలిక్కిరాలేదని మైనార్టీ నాయకులు వాపోతున్నారు.

పిడిఎస్‌లో చిరుధాన్యాలివ్వాలి

ప్రభుత్వాలు సాగును ప్రోత్సహించాలి
'మిల్లెట్ మ్యాన్' ఖాదర్ వలి
రెండో రోజు మిల్లెట్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజా పంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలను ప్రజలకు అందివ్వాలని మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా పిలుచుకునే డాక్టర్ ఖాదర్ వలి కోరారు. అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో పోలీసు కన్వెన్షన్ హాలులో మిల్లెట్ మేళా రెండు రోజులుగా నడుస్తోంది. ఈ మిల్లెట్ మేళాకు ఆదివారం విశేష స్పందన లభించింది. వందల సంఖ్యలో ప్రజలు ఈ మేళాలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఖాదర్‌బాషా హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మిల్లెట్ వాడకం పెంచే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సహించాల్సిన అవసరముందని సూచించారు. ఎరువులు సబ్సిడీకి ఇస్తున్న దానిలో పావు వంతు చిరుధాన్యాలకు సాగుకు కేటాయించినా ఎంతో ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. చిరుధాన్యలపై జిఎస్‌టిని మినహాయించాలని కోరారు. పిడిఎస్‌లో చిరుధాన్యాలకు ప్రజలకు అందివ్వాలని కోరారు. దీర్ఘకాలిక జబ్బులకు కూడా మన తిండే ప్రధాన కారణమని చెప్పారు. ఆహారంలో మార్పులు చేసుకుంటే జబ్బులకు దూరంగా ఉండవచ్చునని సూచించారు. వీటి పట్ల ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహించేందుకు 18 సంస్థలు కలసి ముందుకొచ్చి మేళా నిర్వహించడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు అడిగిని అనేక సందేహాలకు ఆయన సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా చిరుధాన్యాల ప్రోత్సహకానికి అందిస్తున్న సహకారాన్ని, తోడ్పాటు గురించి వివరించారు. వ్యవసాయ శాస్రత్తవేత్త చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ ప్రాంతాల్లో చిరుధాన్యాల



సమావేశంలో మాట్లాడుతున్న మిల్లెట్ మ్యాన్ ఖాదర్‌బాషా

సాగు గురించి ప్రజలకు వివరించారు. అదే విధంగా వీటి వాడకం చేకూరే ప్రయోజనాల గురించి తెలియజేశారు. నాబార్డు జిల్లా మేనేజరు అనురాధా వ్యవసాయ ఉత్పత్తిదారులకు వారి ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి తెలియజేశారు. సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపక కార్యదర్శి త్రిలోచన్ శాస్త్రి అనంతపురం జిల్లాలో అన్ని ఎఫ్‌పిఒలు ఐక్యమై తయారు చేయబడిన విలువ ఆధారిత ఉత్పత్తులకు ఒక బ్రాండ్‌ను సృష్టించాలని సూచించారు. అందుకు తన మద్దతును అందిస్తామని హామీనిచ్చారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌తోపాటు రాయలసీమ జిల్లాలో పక్షుల వలన పంటలకు ఏ రకంగా మేలు జరుగుతుందన్న ఫొటో ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. అదే సందర్భంలో వివిధ రకాల గ్రామీణ కళా ప్రదర్శనలు ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టరు వైవి.మల్లారెడ్డితో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో లేని అభివృద్ధి ఎనిమిది నెలల్లోనే...

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి సవిత



బాధితులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-సోమందేపల్లి

గత ప్రభుత్వం అయిదేళ్లలో చేయని అభివృద్ధిని ఎనిమిది నెలల్లో చేసి చూపించామని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళుతున్నామని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామంత్రి సవిత అన్నారు. సోమందేపల్లిలో రూ.1.50 కోట్లతో పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులను మంత్రి సవిత ఆదివారం ప్రారంభించారు స్నేహలత నగర్ రూ. 30 లక్షలు, ద్వారకా నగర్‌లో రూ. 29 లక్షలు, సప్తగిరి, సాయి నగర్ కాలనీలో రూ. 40 లక్షలు, గీతా నగర్‌లో రూ. 20 లక్షలు, నల్గొండరాయునిపల్లిలో 20 లక్షల రూపాయల నిధులతో పూర్తిచేసిన సిసి రోడ్లు, డ్రయినేజీలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతు అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఓ వైపు అమరావతి పున్ణ నిర్మాణం చేపడుతునే,మరో వైపు పోలవరం నిర్మాణ పనులు వేగవంతం చేశామని చెప్పారు. గత పాలకుల పాలనతో ఆగిన అభివృద్ధి తిరిగి ప్రారంభమయిందంటే అది తమ నాయకుడు చంద్రబాబు ఘనతే అన్నారు. త్వరలో మరో రూ. 50 లక్షలతో మరిన్ని అభివృద్ధి పనులను సోమందేపల్లిలో మొదలు పెడతామని చెప్పారు.

సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం

ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం, యువగళం పాద యాత్రలో నేతన్నలకు నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం చేనేతలకు 200 యూనిట్లు,పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచిత కరెంటు జీవోను ఇటీవల అసెంబ్లీలో విడుదల చేసిన సందర్భంగా సోమందేపల్లి మండల కేంద్రంలోని స్నేహలతానగర్ లో మంత్రి సవిత సమక్షంలో చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ : సోమందేపల్లి మండలంలోని పలువురు బాధితులకు మంజూరైన సిఎంఆర్ఎఫ చెక్కులను మంత్రి సవిత పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సిద్ద లింగప్ప, టౌన్ కన్వీనర్ వడ్డే సురేష్, హిందూపూర్ పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, మాజీ ఎంపీపీ వెంకటేష్, మాగే చెరువు సర్పంచి నరసింహులు, మండల రైతు సంఘ అధ్యక్షులు హరికృష్ణ యాదవ్, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, జనసేన నాయకులు నాగరాజు, రామంజి, వరలక్ష్మి, రామకృష్ణ, శ్రీరాములు అశ్వర్థ ,ఎంపీడీవో నరేంద్ర, సచివాలయ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు

మడకశిర బైపాస్ కెనాల్ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-మడకశిర

హంద్రీనీవా మడకశిర బ్రాంచ్ కెనాల్‌ను తక్షణమే వెడల్పు చేయాలని వైసిపి జిల్లా అధికార ప్రతి నిధి ఆనంద రంగారెడ్డి కోరారు. ఎపి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం నగరంలోని బిజిఆర్ ఫంక్షన్‌హాలులో ఉమ్మడి అనంతపురం జిల్లా అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అందులో సాగునీటి ప్రాజెక్టులు-విభజన హామీలపై చర్చించారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మంజూరు చేసిన మడకశిర బైపాస్ కెనాల్ పనులను వెంటనే చేపట్టాలని ఈ సమావేశ తీర్మానాల్లో చేర్చాలని కోరారు. అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని, పెనుకొండలో అర్ధాంతరంగా ఆగిన ప్రభుత్వ మెడికల్ కాలేజ్ పనులను వెంటనే ప్రారంభించాలని తీర్మానం చేయాలని కోరారు. విభజన సమయంలో ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభలో ప్రకటించిన విధంగా ప్రత్యేక ప్యాకేజీ కోసం ే్రప్రాజెక్టు రూపకల్పనకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐలా పరిధిలోకి ఆటోనగర్

ప్రజాశక్తి-హిందూపురం

ఆటోనగర్ వాసుల కలను స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నెరవేర్చారని, ఇకపై ఆటోనగర్ ఐలా పరిధిలోకి వస్తుందని, మహిళా నిధులతో ఆటోనగర్ ను అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఆటోనగర్ ఐలా పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆటోనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, మాజీ చైర్మన్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోనగర్ వాసుల ఎన్నో సంవత్సరాల కలను నందమూరి బాలకృష్ణ నెరవేర్చారన్నారు. ఆటోనగర్ వాసులకు కేటాయించిన స్థలాల రిజిస్ట్రేషన్ వంటి వాటికోసం ఎక్కడ తిరిగినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఐలా పరిధిలోకి రావడంతో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దీంతోపాటు మౌలిక




సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్

సదుపాయాల కోసం రూ, 4 నుంచి 5 కోట్లతో అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. నిధులు మంజూరై వచ్చిన వెంటనే ఆటోనగర్ ను అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అంజాద్, కురుబ మల్లికార్జున, టిడిపి నాయకులు అమర్నాథ్, ఆదిల్, అజ్మాతుల్లా, డైమండ్ బాబా, ముస్తఫా, ఫజిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ తరహాలో డిజిటల్ క్రాప్ నమోదు

జిల్లా వ్యవసాయశాఖాధికారి వైవి. సుబ్బారావు



ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇదివరకు ఏ విధంగా ఈ క్రాప్ నమోదు విధానం అమలు చేస్తున్నామో అదే తరహాలో కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు డిజిటలైజేషన్ చేసి ఈ క్రాప్ నమోదు చేస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు తెలిపారు. ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : డిజిటల్ క్రాప్ నమోదు చేయడానికి తీసుకుంటున్న చర్యలేవీ?


జవాబు : ఈ క్రాప్ నమోదు విధానం ఏ విధంగా అమలు చేస్తున్నాము అదే తరహాలో కేంద్ర ప్రభుత్వం సూచనలు మేరకు డిజిటలైజేషన్ చేసి ప్రస్తుతం పొలంలో ఉన్న రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డు ఆధార్ తరహాలో ఇవ్వడం జరుగుతుంది. భవిష్యత్తులో రైతులకు సంబంధించిన ప్రతి పథకాన్ని అమలు చేసేందుకు అధికారికంగా విశిష్ట గుర్తింపు కార్డుని ప్రాతిపదికన తీసుకుంటారు. త్వరలో అందరి రైతులకు కూడా విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు జరిగే అవకాశం ఉంది. మన రాష్ట్రంలో కూడా దీనిని అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే సత్యసాయి జిల్లాలో చేపట్టాం. ఇప్పటివరకు 80 శాతం మంది రైతులకు విశిష్ట సంఖ్య కేటాయింపు జరిగింది.

ప్ర : రైతు సేవా కేంద్రాల ద్వారా ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

జ: గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించి రైతు గుర్తింపు సంఖ్య పొందవచ్చు. ని ప్రస్తుతం రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకు మున్ముందు కౌలు రైతులకు, భూములు లేని వ్యవసాయ కూలీలు ఇతర వ్యవసాయ ఆధారితవృత్తులలో ఉన్న వారికి ఇది వర్తిస్తుంది. దీని నమోదు చేయడానికి ఆధార్ కార్డు ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్, భూమి రికార్డు వివరాలు తీసుకొని రైతు సేవ కేంద్రాల్లో సిబ్బందిని కలిసి విశిష్ట సంఖ్య పొందవచ్చు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి పథకానికి ఉపయోగపడే విధంగా రైతులు సహకరించాలి. రైతులకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు ఈ విశిష్ట సంఖ్యతోనే ముడిపడి ఉంటుందని విషయం గుర్తించుకోవాలి.

ప్ర : భూ ఆధారిత పథకాల ద్వారా రైతులకు ఎలాంటి లాభాలు ఉన్నాయి ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 32 మండలాల్లో ఉన్న రైతులు పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పెట్టుబడి సాయం, పంట రుణాలు, తదితర పథకాలు నేరుగా పొందే అవకాశం ఉంటుంది. వర్షాభావ పరిస్థితులు వరదలు, తుఫాన్ వంటి సందర్భాల్లో రైతులు పంటలు నష్టపోయిన సందర్భాల్లో రైతులకు నష్టపరిహారం అందించను న్నారు. నీటిపారుదల, తెగులు నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి ప్రభుత్వం సహాయం అందిస్తుంది.



జిల్లా వ్యవసాయశాఖ అధికారి వైవి. సుబ్బారావు

ప్ర : రైతులకు వేరుశనగ విత్తన కాయల పంపిణీ మీ అభిప్రాయం?

జ: శ్రీ సత్య సాయి జిల్లాలోని 32 మండలాలలో రైతులకు ప్రతి ఖరీఫ్ ,రబీ సీజన్లో వేరుశనగ విత్తన కాయలను సబ్సిడీ ధరపై అందజేస్తున్నాం. అదే తరహాలోఈ ఏడు కూడా అందించడానికి సన్నాహాలు చేస్తున్నాం. నాణ్యమైన విత్తన వేరుశనగ అందించడానికి అన్ని చర్యలు తీసుకున్నాం. గతంలో కూడా అంతర్ పంటలు వేయడానికి రైతులకు జొన్నలు, ఉలవలు, అలసందలు ఉచితంగా అందించాం. ప్రతి రబీ, ఖరీఫ్ సీజన్లో ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా విత్తన గింజలను సకాలంలో అందజేస్తున్నాం.

అమరుల త్యాగం మరువలేనిది

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభలో ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ త్యాగాలు మరవలేనివని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ తెలిపారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆది వారం వారు స్థానిక బాలుర వసతి గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. పంజాబ్‌లో 1907 సెప్టెంబర్ 28న భగత్‌సింగ్ జన్మించారన్నారు. ఆయన ఇచ్చిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదం దేశ నలుమూలలా వ్యాపించి యువతను ఉత్తేజపరిచిందన్నారు. 14 ఏళ్ల వయసులోనే గాంధీ పిలుపు అందుకొని స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారన్నారు. దేశం కోసం 23 ఏళ్ల వయసులోనే ఉరి కంబమెక్కాడన్నారు. రాజ్‌గురు 1908 ఆగష్టు 24న మహారాష్ట్రలో, సుఖ్‌దేవ్ 1907 మే 15న పంజాబ్‌లో జన్మించారన్నారు. వీరిద్దరూ కూడా 22 ఏళ్లకే ఉరి కంబాన్ని ముద్దాడిన వీరులన్నారు. వీరు ముగ్గురూ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించారన్నారు. మతోన్మాదాన్ని వ్యతిరేకించారన్నారు. సమానత్వం, సోషలిజం స్థాపన కోసం పోరాడారన్నారు. అయితే నేడు అధికారంలో ఉన్న బిజెపి దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, ప్రజల మధ్య చిచ్చు పెట్టి విభజిత రాజకీయాల ద్వారా లాభపడాలని చూస్తోందన్నారు. సామ్రాజ్యవాదానికి సాగిలపడుతూ, కార్పొరేట్లకు ప్రజల సొమ్ము దోచిపెడుతూ అసమానతలను పెంచిపోషిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సాకే ముత్యాలు, కళాకారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, బాషా, స్టూడెంట్స్ గణేష్, యశ్వంత్, ప్రసన్న, తేజ, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. సిపిఎం, సిఐటియు నాయకులు ఎస్‌హెచ్.బాషా, కన్వీనర్ జెవి.రమణ, కో కన్వీనర్లు టి.అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ తమ చివరి శ్వాస వరకూ బ్రిటిష్ వారితో పోరాడి వీర మరణం పొందారన్నారు. ఆంగ్లేయులు వీరు ముగ్గురినీ 1931 మార్చి 23వ తేదీ రాత్రి 7.30 గంటలకు ఉరి తీశారన్నారు. వారి స్ఫూర్తితో విద్యార్థి, కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తామని ప్రతిన బూనారు. కార్యక్రమంలో ఎస్.హైదర్‌వలి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీనాథ్, అమన్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై నిప్పులు చెరిగిన యోధుడు భగత్ సింగ్ అని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి కొనియాడారు. పట్టణంలోని ఘనగిరి పాఠశాలలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ షాహిద్ దివస్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రోహిల్ కుమార్ హాజరయ్యారు. హరి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు భగత్‌సింగ్ అన్నారు. క్షమాభిక్ష అవకాశం ఉన్నా తిరస్కరించి ఉరికొయ్యను ముద్దాడిన యోధుడు అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాబావలి, యుటిఎఫ్ నాయకులు రమేష్, నబి, జన విజ్ఞాన వేదిక సభ్యులు ఇమ్రాన్, బాబు, ఇలియాస్, నాగార్జున, ఐలు రాష్ట్ర కమిటీ నాయకుడు యశ్వంత్, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.


కొత్తచెరువులో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ వారిని ఎదురించి అతి చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన వీరుడు భగత్‌సింగ్ అన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి అంజన్‌బాబు, ఎద్దుల రాముడు, ఈశ్వరయ్య, ఎల్‌వి.రమణ, భగత్‌సింగ్ అభిమాని షామీర్‌బాషా, అంజి, చంద్ర, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలను సాధించే దిశగా యువకులు ప్రతిన భూనాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్ సూచించారు.ఆ ముగ్గురు వర్ధంతి సందర్భంగా కొడికొండ చెక్‌పోస్ట్‌లోని సిపిఎం సుందరయ్య కాలనీలో సిపిఎం నాయకులు, పేదలు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితోనే ఇళ్ల స్థలాల పోరాటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామచంద్ర, నరసింహ, నాగరాజు, నాగమణి, రాహంతుల్లా, నారాయణప్ప, రజియమ్మ, షమీవుల్లా, గోపాల్ పాల్గొన్నారు.

రేపు 'చలో కలెక్టరేట్'

జయప్రదం చేయాలని సిపిఎం, సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీ చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం కొత్తచెరువులోని పలు కాలనీల్లో వారు పర్యటించారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అలాగే ఉపాధి కూలీలకు 12 వారాల నుంచి వేతనాలు ఇవ్వకపోవడం, నాయకులు ఉపాధి నిధులను కాజేయడం, ప్రభుత్వాలు ఉపాధి హామీని నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టడం సిగ్గుచేటు అన్నారు. రైతులకు నష్టం చేస్తున్న హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను తక్షణమే ఆపి కాలువను వెడల్పు చేయాలని కోరారు. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు ప్రాంతాల్లో జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్లను ప్రభుత్వ నిధులతో పూర్తి చేసి వెంటనే లబ్ధిదారు లకు అప్పగించాలన్నారు. ప్రధానంగా నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. శ్మశానవాటికలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న గ్రామాల్లో భూమి కేటాయించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ. 1500, తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాల్ల అంజి, మండల కార్యదర్శి సాకే ముత్యాలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్, కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు పవన్, సిఐటియు మండల కోకన్వీనర్ శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో ప్రజలు, రైతులు, కూలీలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్. నరసింహులు పిలుపునిచ్చారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న టిడ్కో, జగనన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పజెప్పాలని, లేనిచో లబ్ధిదారులతో కలిసి ఇళ్లను స్వాధీనం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయ కులు రామ్మోహన్, జగన్మోహన్, ముస్తాక్, అంజి, బాబ్‌జాన్, రామసినాయక్, ఉదయ్, సుధాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ఓబుళదేవరచెరువు : ప్రజా సమస్యలపై ఈ నెల 25వ తేదీ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, సీనియర్ నాయ కులు వివి.రమణ పిలుపునిచ్చారు. వారు మండలంలోని ఆకుతోటపల్లి సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో పర్యటించి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ, నీరు, శ్మశానవాటికకు స్థలం, తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. అమడగూరు, ఒడిసి, నల్లమాడ మండలాల్లోని చెరువులకు హంద్రీనీవా ద్వారా నింపాలని, ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించి వలసలను ఆపాలని, బకాలయి బిల్లులు చెల్లించాలని, కార్మికులపై రాజకీయ వేధింపులు, విధుల నుంచి తొలగించడం ఆపాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, తదితర సమస్యపై ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. వారి వెంట సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, రామంజి, రైతు సంఘం రామిరెడ్డి, బాషా, నరసింహులు పాల్గొన్నారు.

శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక సంత్ సేవాలాల్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచారని ఎమ్మెల్యే ఎంఎస్. రాజు తెలిపారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాల్లో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర సాధికారిక కన్వీనర్ వివిఎం.పాండురంగప్ప పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఉన్న అసమానతలు, సాంఘిక దురాచారాలను రూపుమా పేందుకు సంత్ సేవాలాల్ చివరి శ్వాస వరకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు లక్ష్మీనారా యణ, దాసిరెడ్డి, సర్పంచి నాగరాజు, రామకృష్ణ, వెంకటేష్, భరత్, బంజారా నాయకులు పాల్గొన్నారు.


సంత్‌సేవాలాల్ జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

నియోజకవర్గంలోని 38 మందికి సిఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ. 18 లక్షల చెక్కులను ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి విశ్రాంతి భవనంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి అందజేశారు.

లబ్ధిదారులందరికీ ఇళ్లు

నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ తప్పనిసరిగా ఇల్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో ఆదివారం ఐదు మండలాల హౌసింగ్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేలా పార్టీలకు అతీతంగా అర్హులం దరికీ ఇల్లు మంజూరు చేయాలని సూచిం చారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

పట్టణ వైసిపి మాజీ కన్వీనర్ పుట్ట కామప్ప ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపిలో చేరాడు. వారితో పాటు మండలానికి చెందిన పలువురు టిడిపిలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా వేసి ఆహ్వా నించారు.

పట్టణంలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని టూటౌన్ స్టేషన్ పరిధిలోనిఆటోనగర్ లో ఆదివారం టూటౌన్ సిఐ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో పట్టణంలోకార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జనార్దన్, ,స్పెషల్ పార్టీ పోలీసులు, సిబ్బంది అనుమానిత వ్యక్తుల ఇళ్లతో పాటు రౌడీ షీటర్ ఇళ్లను, ట్రబుల్ మాంగర్స్, ఇళ్లను క్షుణంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమ మద్యం అమ్మే నివాసాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో బెంగళూరు విస్కీ 45, ఓల్డ్ అడ్మిరల్ 19 బాటిల్ ను సీజ్ చేశారు. వాటితో పాటు లైసెన్సు లేని మూడు ఆటోలు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సిఐ వివరించారు. ఈ సందర్భంగా సిఐ అబ్దుల్ కరీం ప్రజలకు రోడ్ సేఫ్టీ, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, శక్తి యాప్ పై అవగాహన కల్పించారు.

రేపు కదిరిలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారంతో ఈ నెల 25వ తేదీ మండలంలోని ఇరుదొడ్డి సమీపంలో ఉన్న బ్లూ మూన్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. జాబ్‌మేళాలో 25 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, నర్సింగ్, ఏదేని డిగ్రీ, బి.టెక్, పి.జి చదివి 18-35 ఏళ్ల అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు, 93901 76421, 91822 88465 నంబర్లకు సంప్రదించాలన్నారు.

జిల్లా పంచాయతీ గ్రేడ్-6 ఉద్యోగుల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రేడ్-6(డిజిటల్ అసిస్టెంట్లు) ఉద్యోగుల నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక సాయి ఆరాధన అతిథి గృహంలో ఆదివారం గ్రామ పంచాయతీ డిజిటల్ అసిస్టెంట్లు సమావేశమయ్యారు. కమిటీ అధ్యక్షులుగా దాదిగిరి చౌడప్ప, ప్రధాన కార్యదర్శిగా లోకేష్, ఉపాధ్యక్షులుగా ప్రశాంతి, భార్గవచౌదరి, కోశాధికారిగా ఘని రసూల్, జాయింట్ సెక్రటరీగా బాలాజీ, సాధిక్‌బాషా, సతీష్, శంకర్‌తో పాటు మరో నలుగురిని ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీ గ్రేడ్-6 ఉద్యోగుల అభ్యున్నతి, ఉద్యోగోన్నతులు, ఆర్థిక సమస్యలు, పని భారం, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు.



నూతనంగా ఎన్నికైన పంచాయతీ గ్రేడ్-6కార్యవర్గం సభ్యులు

ఎపి హంస అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఉమ్మడి అనంతపురం జిల్లా ఎపి హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ ఎండి.షఫీ అధ్యక్షతన ఆదివారం అసోసియేషన్ పెనుగొండ తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమందేపల్లిలో ముందుగా ఎపి హంస అసోసియేషన్ పెనుగొండ తాలూకా సమావేశం నిర్వహిం చారు. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వేణుగోపాల్ వ్యవహరించారు. పెనుకొండ తాలూకా అధ్యక్షునిగా ఆర్.అనిల్ కుమార్ నాయక్, సెక్రటరీగా కె. కేశవయ్య, ట్రెజరర్‌గా కె.రత్నమ్మ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.గిరినాథరావు, ఉపాధ్యక్షులుగా పి.తనూజ, జిసి.సుబ్బలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా ఎం.ప్రభాకర్‌రాజు, భాగ్యలక్ష్మి, బి.సురేష్‌బాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా సి.రవీంద్రను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ హంస అసోసియేషన్ వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగుల సమస్యలపై నిత్యం పోరాడుతుందన్నారు. తాలూకా నూతన అధ్యక్షుడు అనిల్ నాయక్ మాట్లాడుతూ తాలూకాలో వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు హంస అసోసియేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన ఎపి హంస కార్యవర్గం సభ్యులు

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెల్లడించారు. పట్టణం లోని శాలిమార్ కళ్యాణ మండపంలో ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ముందుగా సామూహిక ప్రార్థనల్లో పాల్గొని ఉపవాస దీక్ష విరమించిన ముస్లింలకు మిఠాయిలు తినిపించారు. అనంతరం ఆయనే భోజనం వడ్డించారు. విందులో మత పెద్దలు, ముతవల్లిలు, ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను కాజేసి మతాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయం చేసిన వారిని వదిలిపెట్టమన్నారు. ప్రభుత్వం త్వరలోనే మైనార్టీ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, ఆర్డీవో వివిఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, పట్టణ సిఐ నారాయణరెడ్డి, టిడిపి నాయకురాలు పర్వీన్‌భాను, బహుద్దీన్, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, ఖాదర్ బాదర్ నాగప్ప పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కందికుంట


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

విద్యార్థులకు కరాటే అవసరం

ప్రజాశక్తి-కదిరిటౌన్

విద్యార్థులకు చదువుతో పాటు కరాటే చాలా అవసరమని కరాటే మాస్టర్ షాకీర్ తెలిపారు. పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్ ఆవరణలో ఆదివారం షాకీర్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. షాకీర్ కరాటే వల్ల కలిగే లాభాలు, ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కరాటే వల్ల ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం, ఆత్మ ధైర్యం, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, మేధాశక్తి పెంపొందుతాయన్నారు. ఆపద సమయంలో మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు. ఆరాధ్య, భరత్, జశ్వి, తన్మయ్, వైష్ణవి, జోయా ఫాతిమా, భవిత్, జోషిత, ధీరజ్, హారిక, శ్రీజ, మహమ్మద్ ఫహీమ్ బెల్ట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించగా మాస్టర్ షాకీర్ బెల్ట్, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో కరాటే కోచ్ చాందిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇమామ్‌లు, మౌజన్లకు రంజాన్‌తోఫా అందజేత

కదిరి అర్బన్ : నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మసీదుల ఇమామ్‌లు, మౌజన్లకు ఆదివారం పట్టణంలోని మదనపల్లి రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ ఖాజీ కార్యాలయంలో వైసిపి నాయకులు సాదత్ అలీఖాన్ ఆదివారం రంజాన్‌తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖాజీ హాఫిజ్ రఫిక్ సాహెబ్, కదిరి ఎంఐఎం పార్టీ ఇన్‌ఛార్జి అక్బర్‌ఖాన్, కౌన్సిలర్ ఇలాహి, వైసిపి నాయకులు ఫైజ్‌ఖాన్, జిలాన్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

పోట్లమర్రి ఎస్సీ కాలనీలో విద్యుత్ కనెక్షన్లు కట్

బత్తలపల్లి : మండలంలోని పోట్లమర్రి ఎస్సీ కాలనీలో 200 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించారని విద్యుత్ కనెక్షన్లు కట్ చేశారు. బాధితులు తెలిపిన వివరాలు.. ఎస్సీ కాలనీలో 20 మంది ఇళ్లకు 25 యూనిట్లకు పైగా విద్యుత్ నియోగం జరిగిందని, వీరంతా రూ. 8 వేలకు పైగా బకాయి పడ్డారని ఆదివారం విద్యుత్ సిబ్బంది కనెక్షన్లు తొలగించారన్నారు. గతంలో ఇలాగే బిల్లు రాగా అప్పటి అనంతపురం జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకుంటామని తెలిపినా విద్యుత్ అధికారులు వినకుండా విద్యుత్ కనెక్షన్ కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈకేవైసీకి పోటెత్తిన లబ్ధిదారులు

బత్తలపల్లి : ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఈకేవైసీ చేసుకునేందుకు రేషన్‌కార్డుదారులు ఎగబడ్డారు. ఈకేవైసీ చేయించేందుకు అధికారులు ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 12 యంత్రాలు ఏర్పాటు చేశారు. ఈ విషయంతపై గత రెండు రోజులుగా అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. దీంతో ఉదయం 7 గంటల నుంచే రేషన్ కార్డుదారులు ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. లబ్ధిదారుల రాకతో ఉన్నత పాఠశాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. లబ్ధిదారుల కోసం తాగునీరు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రేషన్‌షాపుల డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.


ఈకెవైసికి బారులు తీరిన జనాలు


వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఓబుళమ్మ, దాసరి నారప్ప జ్ఞాపకార్థం దాసరి ప్రమీల, దాసరి మంజునాథ్ సహకారంతో పట్టణంలోని శ్రీశాంతకళాచౌడేశ్వరీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ప్రముఖ వైద్యులు(ఆర్థో) డాక్టర్ సతీష్, దంత వైద్యులు వివేక్ కుళ్లాయప్ప రోగులకు చికిత్స చేశారు. ఇది 109వ వైద్య శిబిరమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దాతలు మంజునాథ్ కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు హరికృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశం మరోసారి వాయిదా

గాండ్లపెంట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని మరోసారి వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు.

14న జైభీమ్ ర్యాలీ

పెనుకొండ : బహుజనుల ఐక్యత కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14వ తేదీ చేపట్టనున్న జై భీమ్ ర్యాలీని జయప్రదం చేయాలని బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం జై భీమ్ ర్యాలీ కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ భావజాలాలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. జనాభాలో 50 శాతంపైన ఉన్న బహుజనులు నేటికీ యాచించే స్థాయిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజనులు ఐకమత్యంగా ఉంటే సాధించలేనిది లేదన్నారు. కార్యక్రమంలో త్రిపుర రిసార్ట్ అధినేత డాక్టర్ కే.గోపీనాథ్, రవికుమార్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలపై పోరాడాలి

ప్రజాశక్తి-పావగడ

మున్సిపాలిటీలో నెలకొన్న ప్రజల సమస్యలపై పోరాడాలని మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప జెడిఎస్ పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని బనశంకరిలో ఉన్న జెడిఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం 23 వార్డుల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తిమ్మరాయప్ప మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనుల వల్ల రోడ్లు దెబ్బతిన్నాయని వాటి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జెడిఎస్ మహా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వార్డుల్లో కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో తాలూకా అధ్యక్షుడు ఈరన్న, గౌరవాధ్యక్షుడు రాజశేఖరప్ప, నాయకులు అంజయ్య, లక్ష్మీనారాయణప్ప, భరత్ కుమార్, కమల్‌బాబు, మణి, బద్రి, శ్రీనివాస్, నారాయణప్ప, గోపాలకృష్ణ, న్యాయవాది హనుమంత రాయప్ప, బ్రహ్మాచారి, గోపాల్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాలపొడి ప్యాకెట్లు రోడ్డుపాలు'

ప్రజాశక్తి-పావగడ

ప్రభుత్వం 'క్షీరభాగ్య' పథకం కింద పాఠశాల విద్యార్థులకు పాలపొడి అందజేస్తోంది. పాఠశాలలో పిల్లలకు ఇవ్వాల్సిన పాలపొడి ప్యాకెట్లు రోడ్డు పక్కన దర్శనమివ్వడంపై ప్రజలు మండిపడుతున్నారు. వెంకటాపురం రోడ్డులోని ఓ మిల్లు సమీపంలో ఆదివారం మున్సిపల్ చెత్త లారీ నుంచి బస్తాలు పడిపోవడం, కుక్కలు పాలపొడి పాకెట్లు లాగుతుండడం దృశ్యాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి తన మొబైల్‌లో చిత్రీకరించారు. విద్యార్థులకు అందాల్సిన పాలపొడి ప్యాకెట్లు రహదారిపై కని పించడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

30 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని కరావులపల్లి, ఒడిగేపల్లి పంచాయతీతో పాటు గోరంట్ల పట్టణానికి చెందిన 30 వైసిపి 30 కుటుంబాలు ఆదివారం పెనుకొండలోని టిడిపి కార్యాలయంలో టిడిపిలో చేరారు. వారికి మంత్రి సవిత పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో చింతా రామచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, బండి వెంకటరెడ్డి, వడ్డే లక్ష్మీనారాయణ, విక్రమ్‌రెడ్డి, వడిగేపల్లి పంచాయతీ నుంచి అనిల్ కుమార్‌నాయక్, రవినాయక్, ఆంజనేయులు, గోరంట్ల పట్టణం నుంచి నజ్మీభాను, దిల్షాద్, రత్నమ్మ, లక్ష్మీనారాయణమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, పచ్చ అశోక్, వేణు రాయల్, నరేష్, బాలకృష్ణచౌదరి, అజ్మతుల్లా, సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.


మంత్రి సవిత సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు.

27న పశువుల సంత వేలం

ప్రజాశక్తి-గుడిబండ

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పశువుల సంత, వారపు కూరగాయల సంత, దినసరి బస్టాండ్‌కు ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచి అధ్యక్షతన బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఒఆర్‌డి నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ ఆదివారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు గతంలో పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదన్నారు. వేలం పాట పంచాయతీ షరతులకు లోబడి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

హనీట్రాప్ కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి-లేపాక్షి

హనీట్రాప్ కేసులో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలు.. లేపాక్షికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని మహిళ ఫోన్ చేసి చనువుగా మాట్లాడి పరిచయం పెంచుకుంది. ఆ తర్వాత వారు మాట్లాడిన సంభాషణలు రికార్డు చేసి మరి కొందరితో కలిసి డబ్బుల కోసం అతడిని బ్లాక్ మెయిల్ చేశారు. ఈ క్రమంలో వారు అతడి నుంచి రూ. 1.05 లక్షలు ఫోన్ పే, నగదు రూపంలో వసూలు చశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు. ఆ తర్వాత హిందూపురం డీఎస్పీ సూచనలతో హిందూపురం రూరల్ సిఐ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితులైన మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన ధనుంజయ, రమేష్, రవికుమార్, రాధమ్మలను కొడికొండ-శిర జాతీయ రహదారిపై కల్లూరు గ్రామ క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశామన్నారు. వారిని విచారించగా నేరాన్ని అంగీకరించారని తెలిపారు. వారి నుంచి 4 సెల్‌ఫోన్లు, రూ. 45 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపామన్నారు.

సాయంత్రం అనుమతులిస్తారు.. అర్ధరాత్రి అడ్డంగా నరికేస్తారు...

అటవీ శాఖ అధికారుల తీరుపై మండిపడుతున్న పర్యావరణవేత్తలు



వేర్లతో సహా చింత చెట్టును పెకిలించిన దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంతో పాటు సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పచ్చని చెట్లను అడ్డంగా నరకడానికి అటవీశాఖ అధికారులు నిబంధనలకు నీళ్లు వదిలి అనుమతులను ఇస్తున్నారు. ఇచ్చే అనుమతులను సైతం పక్కా ప్రణాళికతో శనివారం సాయంత్రం ఇస్తారు. అనుమతులను పొందిన వారు అదే రోజు అర్ధరాత్రి పచ్చని చెట్లను అడ్డంగా నరికి తెల్లారేపాటికి ఒక్క చెట్టు కూడా లేకుండా చేస్తున్నారు. అటవీ శాఖ అధికారుల తీరుపై పర్యావరణ వేత్తలు మండిపడుతున్నారు. అటవీ శాఖ అధికారులపై పర్యావరణవేత్తలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ వారిపై ఇప్పటివరకు కనీస చర్యలు తీసుకోవడం లేదు అంటే అటవీ శాఖలో అవినీతి ఎంత పేరుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు.

పట్టణంలోని అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న బయలు జాగాలో 20 వరకు పచ్చని చింత చెట్లు ఉన్నాయి. ఈ సంవత్సరం ఈ చెట్లకు చింతకాయలు విరివిగా కాసాయి. ఈ స్థలం ప్రైవేట్‌ది కావడంతో స్థల యజమానులు వేరే వారికి విక్రయించారు. ఈ స్థలాన్ని తీసుకున్న కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులతో కలిసి ఆ స్థలంలో లే అవుట్ వేయాలని నిర్ణయించారు. లేఅవుట్ వేయాలంటే అడ్డంగా ఉన్న ఈ చింత చెట్లను వేర్లతో సహా తీసివేయాలని నిర్ణయించారు. అనుమతులు తీసుకుంటే అనుమతులపై జిల్లా కలెక్టర్, న్యాయస్థానాలను పర్యావరణ వ్యక్తులు ఆశ్రయిస్తారని దీనికి ఒక పక్కా ప్రణాళికను రూపొందించుకుని శనివారం సూర్యాస్తమ సమయంలో అటవీ శాఖ అధికారులతో అనుమతులు తీసుకున్నారు. అనుమతులు తీసుకున్న వెంటనే యంత్రాలను పెట్టి మరి చింత చెట్లను వేర్లతో సహా అక్కడి నుంచి పెకలించారు. ఆదివారం సూర్యోదయ సమయానికి పచ్చని చెట్లన్నీ నేలకొరిగిన దృశ్యాలను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. పర్యావరణవేత్తలు అయితే అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాంతంలో ఉన్న పచ్చని చెట్లన్నీ మాయమవుతున్నాయని, పట్టణ చుట్టూ రెండు కిలోమీటర్ల మేర 20 రోజుల్లో దాదాపు 600 చెట్లకు పైగా ఎటువంటి అనుమతులు లేకుండా నరికేశారు. దీనిపై అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ తమకు తీరిక లేదని అటవీ శాఖ అధికారులు చెప్తున్నారని పర్యావరణవేత్త భాస్కర్ రెడ్డి విమర్శిస్తున్నారు. జిల్లాలో వాల్టా చట్టం ఉన్నప్పటికీ చట్టాన్ని అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చుట్టంగా మార్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం హిందూపురం పట్టణంలో లక్షలాది రూపాయలు ప్రజాధనాన్ని వెచ్చించి మునిసిపల్ శాఖ అధికారులు పురపాలక సంఘం వ్యాప్తంగా ఏడు వేల చెట్లకు పైగా నీరు పోయకుండా చంపేశారని, మరో 1200 చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయని ఆరోపించారు. పురపాలక సంఘం వ్యాప్తంగా మొక్కలు నాటుతున్నామని చెప్పి మున్సిపల్ అధికారులు లక్షలాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారని అన్నారు. ఈ అవినీతిపై జిల్లా కలెక్టర్ తో పాటు పురపాలక సంఘం ఉన్నతాధికారులకు అన్ని ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చెట్లను రక్షించకపోతే రాబోవు రోజుల్లో మనిషికి అవసరమైన ఆక్సిజన్ సైతం కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పచ్చని చెట్లకు అనుమతులు ఇవ్వకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

లబ్ధిదారులందరికీ టిడ్కో గృహాలు కేటాయించాలి

సంక్షేమ పథకాల అమలుకై 25న కలెక్టరేట్ ముందు ధర్నా

సిపిఎం జిల్లా నాయకులు జెడ్ పి శ్రీనివాసులు



నినాదాలు చేస్తున్న సిపిఎం జిల్లా నాయకులు జెడ్ పి శ్రీనివాసులు, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులందరికీ టిడ్కో గృహాలను కేటాయించాలని సిపిఎం జిల్లా నాయకులు జెడ్ పి శ్రీనివాసులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25వ తేదీన పుట్టపర్తి లో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై ఆదివారం ప్రజలను కలిసి ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ. నాయకులు రామాంజి, నరసింహ, సరస్వతి, అనితమ్మ, రామాంజనమ్మ, గంగమ్మ, అర్షియా, సానియా తదితరులు పాల్గొన్నారు.



నిందితుల అరెస్టును చూపిస్తున్న పోలీసులు

జూదం ఆడినా, నిర్వహించినా చర్యలు

సిఐ ఆంజనేయులు

ప్రజాశక్తి-హిందూపురం

జూదం ఆడినా, నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో వారికి కౌన్సిలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేస్తామని అప్ గ్రేడ్ స్టేషన్ సిఐ ఆంజనేయులు హెచ్చరించారు. శనివారం అర్ధరాత్రి హిందూపురం రూరల్ మండలం కోటపి, కెంచనపల్లి గ్రామాలలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి హంద్రీనీవా కెనాల్ పక్కన జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద ఉన్న రూ. 30వేల నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి సిఐ ఆంజనేయులు మాట్లాడుతూ హిందూపురం పరిధిలో జూదం ఆడినా, నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జూదమాడుతూ రెండవసారి పట్టుబడితే వారిపై పిడి యాక్ట్ కేసు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సిఐతో పాటు ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడిపత్రి రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్ల మండల కేంద్రంలో నివాసం ఉంటున్న శివ మురుగేషన్ (40) పని నిమిత్తం తాడిపత్రికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో తాడిపత్రి – బుగ్గ ప్రధాన రహదారిపై వెంకటరెడ్డిపల్లి వద్ద ఎదురుగా బండల లోడ్ వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో శివ మురిగేషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇసుక టిప్పర్లు పట్టివేత

కణేకల్లు : మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలోని ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. రచ్చుమర్రి రీచ్ నుంచి టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

భగత్ సింగ్, రాజ్ గురుదేవ్, సుఖ్ దేవ్ జీవితాలు నేటి యువతకు ఆదర్శమని, వీరి ఆశయాలకు కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బాబావలి పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధులు, విప్లవ యువకిశోరులు భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల 94వ వర్ధంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్నా భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, అజయ్, మహేష్, నాగేంద్ర, మంజునాథ్, దిలీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రజక కాలనీకి నీటి సౌకర్యం

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం పరిధిలో ఉన్న గుడ్డం చాకలికుంట ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. తమ చాకలి వృత్తిని నిర్వహించుకోవడం కోసం ధోబిఘాట్‌కు నీటి సౌకర్యం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. బాలకృష్ణ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఆదివారం ప్రత్యేక పైప్ లైన్ ఏర్పాటు చేసి నీటి సౌకర్యాన్ని కల్పించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేకు, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ కు, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.